సాక్షి జనగామ

శనివారం । 16 । డిసెంబర్ । 2023



వినియోగదారులకు నాణ్యమైన సేవలు

- 8లో ▸

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు.



ఆదివాసీ హక్కులను రక్షించుకోవాలి

ఆదివాసీ హక్కులను రక్షించుకోవాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30⁰/19⁰

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

ప్రయాణికుల వివరాలు ■ పురుషులు ■ మహిళలు

తేదీ	పురుషులు	మహిళలు	శాతం	మొత్తం
9వ తేదీ	2,19,971	94,344	30.01%	3,14,315
10వ తేదీ	1,49,741	2,30,215	60.58%	3,79,956
11వ తేదీ	1,67,412	2,59,933	60.82%	4,27,345
12వ తేదీ	1,37,458	2,46,298	64.18%	3,83,756
13వ తేదీ	1,50,718	2,72,938	64.42%	4,23,656
14వ తేదీ	1,37,182	2,76,091	66.80%	4,13,273



మహాలక్ష్మి భళా..

ఆర్టీసీకి పెరిగిన మహిళా ప్రయాణికులు

- 45 శాతం నుంచి 58 శాతానికి పెరుగుదల
- శుక్రవారం నుంచి జీరో టికెట్.. ప్రయాణానికి గుర్తింపుకార్డు తప్పనిసరి



మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ జారీ చేస్తున్న కండక్టర్

హన్మకొండ: మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకాన్ని ఈనెల 9న సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. సాఫ్ట్‌వేర్ అందుబాటులో లేకపోవడంతో ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు కార్డు అవసరం లేకుండానే ప్రయాణానికి అనుమతిచ్చారు. టికెట్ జారీకి సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రావడంతో కండక్టర్లు శుక్రవారం నుంచి జీరో టికెట్ జారీ చేస్తున్నారు. రాష్ట్ర మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈక్రమంలో స్థానికతను తెలుసుకునేందుకు ఏదేని గుర్తింపు కార్డు చూపించాలనే నిబంధన పెట్టింది. ఇప్పటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించడానికి వెంట ఆధార్ కార్డు లేదా ఏదేని ఇతర గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి.

టిమ్‌లోని క్యాట్ కార్డ్ బటన్‌తో అనుసంధానం

టికెట్ జారీ మిషన్ (టిమ్)లో గతంలో క్యాట్‌కార్డు చెలామణిలో ఉన్న సమయంలో వారికి టికెట్ జారీ కోసం ప్రత్యేక బటన్ ఉండేది. ఆ కార్డుల రద్దుతో ఆ బటన్ ఖాళీగా ఉంది. మహిళలకు ఉచిత ప్రయాణంతో క్యాట్‌కార్డు బటన్‌ను జీరో టికెట్‌కు అనుసంధానం చేస్తూ సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ బటన్ నొక్కగానే మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన పెద్దలు, పిల్లల ఆప్షన్ వస్తుంది. ఆ ఆప్షన్ ఎంచుకుని స్టేజీ నంబర్ నొక్కగానే టికెట్ బయటకు వస్తుంది. ఈ టికెట్‌పై ప్రయాణికుడు ప్రయాణించే దూరానికి నిర్దేశించిన చార్జీల మొత్తంతోపాటు జీరో టికెట్ వస్తుంది. దీంతో బస్సు వారీగా ఉచితంగా ఎంత మంది ప్రయాణించారు.. చార్జీ ఎంత మొత్తం అనే వివరాలు అదే రోజు తెలిసిపోతాయి.

వరంగల్ రీజియన్‌లో పెరిగిన ప్రయాణికులు

మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు రోజు వరకు వరంగల్ రీజియన్ పరిధిలో బస్సులో 45 శాతం మహిళా ప్రయాణికులుండేవారు. ఉచిత ప్రయాణంతో వీరి సంఖ్య 58.91 శాతానికి చేరింది. ఈ నెల 9 నుంచి 14 వరకు 23,42,301 మంది ప్రయాణించగా ఇందులో 13,79,819 మంది మహిళలు, 9,62,482 మంది పురుషులు ఉన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి..



మహాలక్ష్మి పథకంతో బస్సులో ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు తప్పనిసరి. గుర్తింపు కార్డు చూపించకపోతే చార్జీతో కూడిన టికెట్ జారీ చేస్తారు. ఉచిత ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చింది. జీరో టికెట్ జారీ చేస్తున్నాం.

- జాస్తి శ్రీలత, వరంగల్ ఆర్‌ఎం

న్యూస్‌రీల్

సిబ్బంది సహకరించాలి



జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఇబ్బంది కలగకుండా సిబ్బంది సహకరించాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు, రోజు వారీగా పనులు చేసుకునే మహిళలకు ఈ పథకం ఉపయోగకరంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 1,81,309 మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని, నేటి నుంచి జీరో టికెట్లు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిన డిపో మేనేజర్ జ్యోత్స్న నుంచి వివరాలు తెలుసుకున్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా లలిత్‌కుమార్



జనగామ: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పర్మార్ పింకేష్ కుమార్ లలిత్‌కుమార్(ఐఏఎస్ 2021 బ్యాచ్)ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన లలిత్‌కుమార్.. 2022 సెప్టెంబర్ 2న ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా చార్జ్ తీసుకున్నారు. ఎనిమిది నెలలు పని చేసిన తర్వాత హైదరాబాద్ వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల విభాగంలో ఖాళీలు భర్తీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. లలిత్‌కుమార్ జనగామకు వచ్చారు. ఉద్యోగ రీత్యా ట్రెయినీ పూర్తి చేసుకున్న తర్వాత మొదటిసారి జనగామ నుంచి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

23న కళాకారుల ఎంపిక పోటీలు

జనగామ రూరల్: వచ్చే ఏడాది నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనే కళాకారుల ఎంపికలు ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు డీపీఓ రంగాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వారు పాల్గొనాలని, ప్రతిభ ఉన్న వారికి జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. జానపద నృత్య బృందం, జానపద నృత్యం సోలో, జానపద గేయాలు, లైఫ్ స్కిల్స్‌లో కథా రచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీలో.. సామూహిక, వ్యక్తిగత ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. శనివారం జనగామలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్నవారు సంబంధిత సామగ్రి, ధ్రువీకరణ పత్రాలు, 2 ఫొటోలతో రావాలన్నారు. వివరాలకు 97030 33348, 91825 52593 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రామైక్య సంఘం పనితీరు పరిశీలన



లింగాలఘణపురం: అస్సాం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల బృందం మండల పరిధి నెల్లుట్లలో శుక్రవారం వాసవీ గ్రామైక్య సంఘం పనితీరును పరిశీలించింది. అస్సాం రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్ గౌహతి ప్రాజెక్టు మేనేజర్ ఖగేన్‌దత్త ఆధ్వర్యంలో 15 మంది సభ్యులు గ్రామంలోని మూడు సంఘాలను సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన మహిళా అభివృద్ధి సొసైటీ డైరెక్టర్ మురళీజాజునా, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసుగోమాస్, డీఆర్‌డీఏ బుగులయ్య, ఏపీడీ నూరొద్దీన్, ఏపీఓ శంకరయ్య, సర్పంచ్ స్వరూపరాణి తదితరులున్నారు.

వణుకుతున్న 'వసతి'

రిపేరుకు వచ్చిన సోలార్ హీటర్లు.. విద్యార్థులకు తప్పని చన్నీటి స్నానం.. రుచిగా లేని భోజనం.. కంపు కొడుతున్న టాయిలెట్లు.. ఆవరణలో పందులు, కుక్కల సంచారం.. రాత్రి సమయంలో అదుబాటులో లేని వార్డెన్లు.. ఇదీ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల దుస్థితి. గురువారం రాత్రి 'సాక్షి' బృందం హాస్టళ్లను విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. - జనగామ

పాడైన సోలార్ హీటర్లు

- అరకొర.. నాణ్యతలేని దుప్పట్లు
- మెనూ పాటించకుండా భోజనం
- ప్రమాదకరంగా విద్యుత్ కనెక్షన్లు
- రాత్రి పూట వాచ్‌మెన్‌లే దిక్కు
- ఇదీ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి సమస్యలు



జనగామ: ఎస్సీ(ఏ) హాస్టల్‌లో చద్దర్లు లేకుండా చలిలోనే నిద్రిస్తున్న విద్యార్థులు

సాక్షి విజిట్

జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర వసతి గృహాలు 42 ఉండగా, 4,274 మంది విద్యార్థులు ఉంటున్నారు. అనేక హాస్టళ్లలో సోలార్ హీటర్ పరికరాలు పనిచేయడంలేదు. విద్యార్థులు చన్నీటితో స్నానం చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారు. స్కావెంజర్‌లు లేక చాలా చోట్ల టాయిలెట్లు కంపుకొడుతున్నాయి. ప్రహరీలు కూలిపోయి హాస్టళ్ల ఆవరణ, మైదానాల్లో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. కొన్ని చోట్ల సరిపడా దుప్పట్లు పంపిణీ చేయకపోగా.. మరికొన్ని చోట్ల అసలే ఇవ్వలేదు. పలు వసతి గృహాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయంలో వార్డెన్‌లు అందుబాటులో ఉండడం లేదు. ఆ బాధ్యతలు వాచ్‌మెన్లు చూస్తున్నారు. మొత్తానికి వసతి గృహాల పర్యవేణను అధికారులు గాలికి వదిలేశారని చెప్పవచ్చు.

కాలం చెల్లిన భవనంలో..



పెచ్చులూడుతున్న అద్దె భవనం స్లాబ్

దేవరుప్పుల: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య లేక రెండింటిని కలిపారు. గతంలో నిర్మించిన పక్కా భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలోకి మార్చారు. అదికూడా కాలంచెల్లిన భవనం కావడంతో పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. గురువారం రాత్రి హాస్టల్‌లో 20 మంది విద్యార్థులున్నారు. ఇటీవల ప్రభుత్వం దుప్పట్లు ఇచ్చినా సరిపోక చలికి తట్టుకోలేక ఇళ్ల నుంచి తెచ్చుకున్నారు. వార్డెన్‌తో పాటు ఒకే తాత్కాలిక సిబ్బంది ఉన్నారు.

చలికి తట్టుకోలేక..



బీసీ బాలుర వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులు

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో 20 మంది విద్యార్థులున్నారు. రెండు రోజుల క్రితమే ఒక దుప్పటి, బెడ్‌షీట్ ఇచ్చారు. చలి పెరగడంతో ఇళ్ల నుంచి తెచ్చుకున్న పాత దుప్పట్లతో సరిపెట్టుకుంటున్నారు. మెనూ ప్రకారంగా భోజనం వడ్డించడం లేదు. బీసీ వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉండగా.. అందరికి పూర్తి స్థాయిలో దుప్పట్లు ఇవ్వలేదు. సోలార్ హీటర్ పాడైపోయింది.

సోలార్ హీటర్ పనిచేయడంలేదు..



సోలార్ హీటర్ పని చేయడంలేదు. చలి పెరిగి వణికిపోతున్నా చన్నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. వార్డెన్ వారం రోజులకు ఒకసారి వస్తున్నారు. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

- గాదె వినయ్, ఎస్సీ హాస్టల్ విద్యార్థి

వార్డెన్‌కు చెప్పినా..



మెనూ ప్రకారం భోజనం పెడుతలేరు. గుడ్డు అసలే ఇవ్వడం లేదు. వార్డెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు. హాస్టల్‌లో ఇచ్చిన ఒక దుప్పటి, బెడ్‌షీట్‌తో చలి ఆగడంలేదు.

- ధరావత్ శ్రీరాం, బీసీ హాస్టల్ విద్యార్థి

అద్దె భవనంలో ఇబ్బందులు



అద్దె భవనంలోని ఎస్సీ హాస్టల్

పాలకుర్తి/పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్‌లో 10 మంది విద్యార్థులున్నారు. చలికాలం కావడంతో దుపట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి ఉంది. ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ లేక తాగునీటికి తిప్పలు తప్పడం లేదు.

సరిపడా మరుగుదొడ్లు లేవు..



హాస్టల్‌కు సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నం. సొంత భవనం నిర్మించాలి. సరిపడా మరుగుదొడ్లు లేవు. ఆరుబయటనే స్నాన్నాలు చేస్తున్నాం. ఆర్‌ఓ ప్లాంట్ లేక బయట నీరు తీసుకొస్తున్నాము.

- ఉదయ్, 5వ తరగతి

జిల్లాలో వసతి గృహాల వివరాలు

హాస్టళ్లు	సంఖ్య	విద్యార్థులు
ఎస్టీ పోస్టు మెట్రిక్	మూడు	1,259
ప్రీ మెట్రిక్	ఏడు	1,485
బీసీ పోస్టు మెట్రిక్	ఆరు	362
ప్రీ మెట్రిక్	పది	521
ఎస్సీ పోస్టు మెట్రిక్	నాలుగు	194
ప్రీ మెట్రిక్	పన్నెండు	453

దుప్పట్లు వారం క్రితం ఇచ్చారు



ఎస్సీ హాస్టల్‌లో..

బచ్చన్నపేట: ఎస్సీ హాస్టల్‌లో 20 మంది విద్యార్థులు ఉన్నారు. వారం రోజుల క్రితం దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు సింగిల్ పరుపులపై కార్పెట్లు వేసుకొని నిద్రిస్తున్నారు. చలికి వణికిపోతున్నారు.


అరకొర సౌకర్యాలు..



ప్రహరీకి రేకులు అడ్డం పెట్టిన బీసీ బాలుర హాస్టల్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో ఎస్టీ బాలుర హాస్టళ్లు, ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల, బీసీ బాలుర(ఏ, బీ), బీసీ బాలికల, కళాశాల హాస్టల్, బాలుర కళాశాల, ఎస్సీ బాలికల, బాలుర కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. బీసీ బాలుర హాస్టల్ ప్రహరీ కూలిపోవడంతో రేకులు అడ్డంగా పెట్టారు. మైదానంలోకి పందులు, కుక్కలు వస్తున్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు నేటికీ దుప్పట్లు ఇవ్వలేదు. గదుల కిటికీలకు డోర్‌లు సరిగాలేక చలితో వణుకున్నారు. ఇతర హాస్టళ్లలో ఇచ్చిన దుప్పట్లో నాణ్యత లేదు. ఒక దుప్పటిని ఇద్దరు, ముగ్గురు కప్పుకుని నిద్రిస్తున్నారు. రాత్రి పూట విష పురుగుల బెడద ఉంది. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని, వార్డెన్లు స్థానికంగా ఉండటం లేదని విద్యార్థులు తెలిపారు.

బాలికలకు తప్పని ఇబ్బందులు



ఖిలాషాపూర్ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు..

రఘునాథపల్లి: ఖిలాషాపూర్ బాలుర వసతి గృహంలో 32 మంది విద్యార్థులకు 28 మంది ఉన్నారు. మరుగుదొడ్ల డోర్లు ఊడిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. విద్యార్థులు బహిర్భూమికి కెనాల్ కాలువ వద్దకు వెళ్తున్నారు. రఘునాథపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల వసతి గృహంలో సౌకర్యాలు లేక బాలికలు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది పిల్లలు దుప్పట్లు లేక చలికి వణుకుతున్నారు. భోజనం మెనూ పాటించడం లేదని విద్యార్థులు చెప్పారు.

అన్నీ సమస్యలే..



జనగామ ఎస్సీ(ఏ) హాస్టల్‌లో కుళాయివద్ద అపరిశుభ్రత, పాడైన ఆర్‌ఓ ప్లాంట్, గోడకు టేబుల్ ఫ్యాన్

జనగామ: జిల్లా కేంద్రంలో ఎస్సీ–ఏ, సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. సీ హాస్టల్‌లో 18 మంది విద్యార్థులుండగా రాత్రి సమయంలో వార్డెన్ అందుబాటులో లేరు. కుక్ మాత్రమే కాపలా ఉన్నారు. పిల్లలకు సరిపడా పడకలు, దుప్పట్లు ఉన్నాయి. ఎస్సీ(ఏ) వసతి గృహంలో 30 మంది విద్యార్థులున్నారు. నేటికీ దుప్పట్లు ఇవ్వలేదు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న బెడ్‌షీట్లు ఎటూ సరిపోక చలికి వణికిపోతున్నారు. సబ్బులు రాలేదు. షూ, స్వెట్టర్ల పంపిణీ లేదు. సోలార్ సిస్టం పాడైపోయింది. చన్నీటితో స్నానం చేస్తున్నారు. స్కావెంజర్ లేక టాయిలెట్లు కంపుకొడుతున్నాయి. ఆర్‌ఓ ప్లాంట్ రిపేరుకు వచ్చింది. ప్రైవేట్ ప్లాంట్ల నుంచి క్యాన్ వాటర్ తెప్పిస్తున్నారు. విద్యార్థులు పడుకునే గదుల్లో విద్యుత్ కనెక్షన్లు అధ్వానంగా ఉన్నాయి. టేబుల్ ఫ్యాన్లను గోడకు తగిలించడంతో ప్రమాదకరంగా ఉంది. భోజనం సరిగా లేదని విద్యార్థులు వాపోయారు.

టేబుల్ ఫ్యాన్లే సీలింగ్ ఫ్యాన్లుగా..



ఉదయం 11 గంటల వరకు చలి పోతలేదు. సోలార్ సిస్టం పాడైంది. చన్నీటితో స్నానం చేసి బడికి పోతున్నం. గదుల్లో టేబుల్ ఫ్యాన్లను సీలింగ్ ఫ్యాన్లుగా వేలాడదీశారు. భయంగా ఉంది. దుప్పట్లు ఇవ్వలేదు. స్వెట్టర్లు, సబ్బులు రాలేదు. భోజనం బాగుంటలేదు.

- బి.జయంత్, 9వ తరగతి, ఎస్సీ-ఏ హాస్టల్

ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలి

- డీసీపీ సీతారాం



మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

జనగామ: పోలీస్‌స్టేషన్ వచ్చే ప్రజల సమస్యలపై దృష్టి సారించడంతోపాటు వారికి తమ శాఖ పరంగా న్యాయం జరిగేలా చూడాలని డీసీపీ సీతారాం అన్నారు. జనగామ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ దేవేందర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సైలు సృజన్, అరుణ్, తిరుపతి, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులతో సమీక్ష నిర్వహించారు. అపహరణకు గురైన సొత్తు రికవరీ, పెండింగ్ కేసులు తదితర విషయాలపై ఆరాతీసి, రికార్డులను తనిఖీ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవేందర్‌పటేల్



దేవేందర్‌కు నియామక పత్రం ఇస్తున్న రవికృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా మీదికొండ గ్రామానికి చెందిన గాండ్ల దేవేందర్‌పటేల్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శుక్రవారం దేవేందర్‌పటేల్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని, రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. ఇందుకు గుర్తింపుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

పాలకు ఇన్సెంటివ్ కొనసాగించాలి

ప్రజాభవన్ ప్రజావాణిలో పాడి రైతుల వినతి



ప్రజావాణిలో వినతి పత్రం ఇస్తున్న పాడి రైతులు

జనగామ: పాడి పరిశ్రమను ప్రోత్సహించే విధంగా గత ప్రభుత్వం లీటరు పాలకు ఇన్సెంటివ్‌గా అందించిన రూ.4ను కొనసాగించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్ కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.4ల ప్రోత్సాహకాన్ని నిలిపివేసిందనీ.. కాంగ్రెస్ సర్కారు పునరుద్ధరిస్తే పాల సేకరణ పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట జనగామ జిల్లాకు చెందిన 30 మంది రైతులు ఉన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- వైద్యులు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి.. కమ్యూనిటీ ఏరియా, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. శుక్రవారం ప్రజా వైద్యంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, బచ్చన్నపేట, ఏరియా ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీల పెంపునకు వైద్యులు, సిబ్బంది.. గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రణాళికతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పించిన ఆధునిక వైద్య సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతర వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రశాంత్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, డాక్టర్ సుగుణాకర్, అశోక్, భాస్కర్, సుధీర్, మల్లికార్జున్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : వాకాటి కరుణ

ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలతో మెరుగైన విద్యా అందించేలా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎస్సీఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి ఇతర అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి రూపొందించిన 1 నుంచి 5వ తరగతికి 'తొలిమెట్టు', 6 నుంచి 9వ తరగతికి 'ఉన్నతి', పదవ తరగతికి 'లక్ష్య' అనే ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఈనెల 12 నుంచి జనవరి 24 వరకు 'అకడమిక్ బబుల్' ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా పాఠశాలల వివరాలు తెలుసుకొని తనిఖీలు చేపట్టాలని కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, డీఈఓ రాము, ఏఎంఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

విద్యతోనే ముందడుగు

- మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

హన్మకొండ: విద్యతోనే సమాజం ముందడుగు వేస్తుందని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ, సైకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల ఫలితాలు పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న మూడు నెలల ప్రేరణ కార్యక్రమాన్ని శుక్రవారం హనుమకొండలోని ఆదర్శకాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమ రూపకర్త, సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఫలితాలు పెంపొందించేందుకు ఉచితంగా ప్రేరణ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. వివరాలకు 9989310141 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పరికిపండ్ల వేణు, సూర్య కిరణ్, పాగాల రాజయ్య, ఆడెపు రామకృష్ణ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆడ సుధాకర్, రామ్, లక్ష్మణ్, తేరాల యుగంధర్, బేతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న కేయూ రిటైర్డ్ అధ్యాపకుల సమావేశం



కేయూ క్యాంపస్: పెన్షనర్స్ డే సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ అధ్యాపకుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17న యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ రిటైర్డ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ అధ్యాపకుల సమస్యలపై చర్చించడంతో పాటు విశ్వవిద్యాలయ పూర్వవైభవం, అభివృద్ధి – ప్రస్తుత కర్తవ్యాలు గురించి అవలోకనం చేసుకునేందుకు పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధి ప్రధానంగా వ్యవసాయ ప్రాంతమని, రైతులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందించాలని సూచించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన సీఎండీ వరుణ్ రెడ్డికి డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, తాజా మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భద్రకాళి ఆలయంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ పూజలు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి ఆలయాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డికి ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషభారతి, అర్చకుడు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వరుణ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాగా, అర్చకులు అరుణ్‌రెడ్డికి అమ్మవారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఈఓ శేషుభారతి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.



సీఎండీ వరుణ్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ఈఓ

సీపీని కలిసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ..

వరంగల్ క్రైం : టీఎస్ ఎన్పీడీసీఎల్ నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వరుణ్‌రెడ్డి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు పలు అంశాలపై చర్చించుకున్నారు.



సీపీకి పూలమొక్క అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

దొరికిన కిరాతకులు..

- రాకేశ్‌పై దాడి ఘటనలో ముగ్గురి అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ బోనాల కిషన్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బోనాల కిషన్

రామన్నపేట : వరంగల్ బస్టాండ్ ప్రాంతంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం ఎదుట రాకేశ్‌పై దాడి చేసి అతడి మృతికి కారణమైన ముగ్గురి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇంతెజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన రాకేశ్(23) వంటపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 5వ తేదీన పర్లపల్లి విజయ అనే మహిళతో కలిసి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ ముందు నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొందరు దుండగులు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించగా వారితో రాకేశ్ వాగ్వాదానికి దిగాడు. దీంతో వారు రాకేశ్‌పై రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈఘటనలో రాకేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే విజయ అక్కడ ఉన్న స్థానికుల సాయంలో 108లో రాకేశ్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతున్న రాకేశ్ ఈ నెల 12వ తేదీన రాత్రి మృతి చెందాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నేరస్తుల గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ దాడి ఘటనలో గరీబ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీధర్, సదువుల బన్ని, ఇస్లావత్ ప్రవీణ్ పాల్గొన్నట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ ముష్కే శ్రీనివాస్, ఎస్సై కొమురెల్లి, క్రైం విభాగం సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

- కమలాపురంలో ఘటన



రాము (ఫైల్)

మంగపేట: ఓ యువకుడు గోదావరిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కమలాపురం జీపీ పరిధిలోని గోదావరి ఒడ్డు ప్రాంతంలో జరిగింది. గోదావరి ఒడ్డు ప్రాంతానికి చెందిన వృద్ధుడు కొత్తపల్లి చినబాబు మృతి చెందాడు. ఇదే కాలనీకి చెందిన రాంశెట్టి రాము (22).. చినబాబు అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అంత్యక్రియల అనంతరం సమీపంలోని గోదావరిలో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలోనే గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు కూడా రాము ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రెండు ఘటనలతో కాలనీలో విషాదం అలముకుంది.

సులువుగా డబ్బు సంపాదించడానికి..

కాంక్రీట్ మిల్లర్ల అపహరణ

- తండ్రీ, కుమారుల అరెస్టు, రిమాండ్
- రూ.4.10 లక్షల విలువైన యంత్రాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం



దొంగల అరెస్టు చూపుతున్న డీసీపీ సీతారాం, సిబ్బంది

జనగామ: సులువుగా డబ్బు సంపాదించాలని తండ్రి, కుమారులు నిర్ణయించుకున్నారు. దీనికి చోరీలే మార్గమని భావించారు.అనుకున్నదే తడువుగా కాంక్రీట్ మిల్లర్లను అపహరించారు. అనంతరం వాటిని అమ్మే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటన జనగామ పట్టణంలో జరిగింది. ఈ చోరీకి సంబంధించిన వివరాలను డీసీపీ పి.సీతారాం శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పాలడుగు మండలం పొలాస గ్రామానికి చెందిన తిరుపతి శివయ్య తన ఇద్దరు కుమారులు హరికృష్ణ, బాలయ్యతో కలిసి బతుకుదెరువు నిమిత్తం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు వచ్చాడు. భవన నిర్మాణ రంగంలో హుస్నాబాద్, సిద్దిపేట, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో మేస్త్రీ, కూలీ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకున్నారు. అయితే జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించడానికి చోరీలను ఎంచుకున్నారు. భవన నిర్మాణ రంగంలో అనుభవం ఉండంతో అందులో ఉపయోగించే ఖరీదైన కాంక్రీట్ మిల్లర్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా సిద్దిపేట–1, 2, జనగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో మిల్లర్లను ఎత్తుకెళ్లి జనగామ ప్రాంతంలోని రహస్య ప్రాంతంలో ఉంచారు. అనంతరం మిల్లర్లను విక్రయించేందుకు జనగామకు వచ్చిన వీరు పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డు వడ్లకొండ బైపాస్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. ముగ్గురిపై అనుమానం రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కాంక్రీట్ మిల్లర్ల అపహరణ విషయం బయటపడింది. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కాగా, కాంక్రీట్ మిల్లర్ల దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీనివాస్, ఎస్సైలు జి.అరుణ్, ఏఎస్సై పి.శ్రీనివాస రాజు, కానిస్టేబుళ్లు కె.మహేష్, బి.కరుణాకర్, టి.రామన్నను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు సృజన్, తిరుపతి ఉన్నారు.

కమలాపురంలో చోరీ.. నిందితుడి అరెస్టు

- రూ. 1.19 లక్షలు, సెల్ ఫోన్ స్వాధీనం



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట: మండలంలోని కమలాపురంలో కొద్ది రోజుల క్రితం చోరీకి పాల్పడిన తాడ్వాయి మండలం వీరాపురం గ్రామానికి చెందిన చేల సందీప్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ. 1.19 లక్షల నగదు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఈనెల 1వ తేదీన కమలాపురంలో జరిగిన చోరీ కేసుపై దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని విచారించారు. ఈ విచారణలో గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చిన సందీప్ అని తెలిసింది. దీంతో అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ. 1.19 లక్షల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని ములుగు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యులు బాధ్యతాయుతంగా ఉండాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీ ప్రసాద్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీ ప్రసాద్

ఎంజీఎం : సమాజంలో ఏ వృత్తికి లేని విలువ వైద్యానికి ఉంటుందని, అందుకే వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వరంగల్ ఐఎంఏ హాల్‌లో 2023–24 నూతన కార్యవర్గ ప్రమాణాస్వీకార మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా మహ్మద్ అన్వర్ మియా, ఉపాధ్యక్షులుగా అజిత్ మహ్మద్, కొలిపాక వెంకటస్వామి, బుర్రి సంధ్యరాణి, ప్రధాన కార్యదర్శిగా బింగి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా నరేశ్‌కుమార్, రామృష్ణ, అడబోయిన అనిత, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్ ప్రమాణాస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాళీప్రసాద్ మాట్లాడుతూ నూతన కమిటీ వైద్యుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆస్పత్రులు, వైద్యులపై జరుగుతున్న దాడులను నివారించడానికి ఎథికల్ కమిటీని మరింత పటిష్ఠంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎథికల్ కమిటీ చైర్మన్ డాక్టర్ శేషుమాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్యారాణి, ఐఎంఏ హెల్త్ స్కీమ్ చైర్మన్ డాక్టర్ బందెల మోహన్‌రావు, కెఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, హన్మకొండ, వరంగల్ డీఎంహెచ్‌ఓలు సాంబశివరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పాకాలలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పాకాల గ్రామానికి చెందిన కడిపికొండ సోమిరెడ్డి(75) ద్విచక్ర వాహనంపై కొడకండ్ల నుంచి పాకాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పాకాల క్రాస్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న స్తంభాన్ని ఢీకొంది. దీంతో సోమిరెడ్డికి తీవ్ర గాయాలుకావడంతో వెంటనే 108లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

విద్యతోనే సామాజిక ప్రగతి



హాజరైన విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది



మాట్లాడుతున్న చంద్రశేఖర్

- మానవ హక్కుల కార్యకర్త చంద్రశేఖర్
- బాలగోపాల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి: జి హరగోపాల్

కేయూ క్యాంపస్: విద్యతోనే సామాజిక ప్రగతి సాధ్యమని మానవ హక్కుల కార్యకర్త, ఏపీలోని అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ఎ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో వీసీ తాటికొండ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మానవహక్కుల నేత దివంగత డాక్టర్ కే బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో 'మానవ హక్కులు – ప్రజాస్వామ్యం' అనే అంశంపై చంద్రశేఖర్ స్మారకోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యం.. జీవన విధానం అన్నారు. ఆదివాసీల ఉనికి కనుమరుగవుతుందన్నారు. ఆదివాసీలు ప్రజాస్వామ్యంలో అంతర్భమన్నారు. అటవీ సంరక్షణ సవరణ చట్టం -2023 సంరక్షణ చట్టం కాదన్నారు. దీంతో ఆదివాసీల హక్కులకు కూడా భంగం కలిగే అవకాశం ఉందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం- 2020లో చాలా లోపాలు ఉన్నాయన్నారు. మార్కుల ఆధారంగా విద్యార్థులు గ్రేడింగ్ సరికాదన్నారు. ప్రముఖ సామాజికవేత్త, సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు జి హరగోపాల్ మాట్లాడుతూ పర్స్పెక్టివ్ సంస్థలో బాలగోపాల్ కూడా సభ్యుడిగా ఉండేవారన్నారు. ఈ సంస్థ తరఫున సామాజికపరమైన చాలా పుస్తకాలను ప్రచురించామన్నారు. బాలగోపాల్ పుస్తకాలు బహుళ జనాదరణ పొందాయన్నారు. నేటి విద్యార్థుల్లో పుస్తకపఠనం తగ్గిందని, పుస్తకాలు చదవడం జీవితంలో భాగం కావాలన్నారు. బాలగోపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. న్యాక్ మాజీ డైరెక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బాలగోపాల్ నోబెల్ మాన్ అన్నారు. గొప్ప సామాజిక, శాస్త్రీయ విశ్లేషకుడు బాలగోపాల్ అసాధారణ వ్యక్తి అన్నారు. వీసీ రమేష్ మాట్లాడుతూ గొప్ప మానవతా వాది బాలగోపాల్ అన్నారు. నేటి విద్యార్థులు ఆయన చరిత్ర తెలుసుకోవడం అవసరం ఉందన్నారు. అనంతరం బాలగోపాల్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, బాలగోపాల్ సతీమణి డాక్టర్ వసంత లక్ష్మితో పాటు, జి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూములు కబ్జా చేస్తే చర్యలు

- నీటిపారుదల శాఖ డీఈఈ రాజు
- బంధం చెరువులో రోడ్డు తొలగింపు
- 'సాక్షి' కథనాలకు స్పందన

సాక్షి స్పందన



రోడ్డును తొలగిస్తున్న అధికారులు

హసన్‌పర్తి: చెరువు భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నీటిపారుదలశాఖ డీఈఈ రాజు హెచ్చరించారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని బంధం చెరువును ఆక్రమించి నిర్మించిన రోడ్డును సంబంధిత అధికారులు శుక్రవారం తొలగించారు. నీటిపారుదలశాఖ డీఈఈ రాజు,ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. బంధం చెరువు కబ్జాపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. ఇందుకు అధికారులు స్పందించారు. అంతకు ముందు రోడ్డు నిర్మాణం చేపట్టిన వారి గురించి అధికారులు ఆరా దీశారు. రాత్రి వేళల్లో బడా నాయకుల అండతో కొందరు వ్యక్తులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈఈ రాజు మాట్లాడుతూ బంధం చెరువు కబ్జాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

- పీవీఎన్‌ఆర్ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు మహేందర్
- మామునూరు కేవీకేలో కిసాన్ మేళా



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అధ్యక్షత వహించగా డాక్టర్ మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్తిలో గులాబీ రంగు పురుగును నివారిస్తే అధిక దిగుబడి సాధించడమే కాకుండా కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు అనుసంధాన పంటల సాగు కూడా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, డీఏఓ రవీందర్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, కేవీకే శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, రాజు, శశాంక్, సాయికిరణ్, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను రక్షించుకోవాలి

- తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్



ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఇదే..

విద్యారణ్యపురి: ఆదివాసీ హక్కులు, చట్టాలను రక్షించుకోవాలని, అందుకు పోరాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేయూ సమీపంలోని ఓ హాల్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కుల చట్టాలు, ఆదివాసీల స్వయం పాలన, ఐదో షెడ్యూల్ అమలు, రిజర్వేషన్‌లో లంబాడీలతో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్(ములుగు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొడం గణేష్ (ఆదిలాబాద్), ప్రధాన కార్యదర్శిగా గుర్రాల రవీందర్ (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ(ములుగు), ముక్తిరాజు (భద్రాద్రి కొత్తగూడెం), కె తిరుపతి (మంచిర్యాల), ఊకె సంజీవ్ (ఆదిలాబాద్), అట్టం సుభద్ర, ఊకే సుదర్శన్, తాటిరామరావు(ఖమ్మం) సహాయ కార్యదర్శులుగా అలం కిశోర్, సోయం జంగు (మంచిర్యాల), సోయం విక్రమ్ (జగిత్యాల), గోడం రేణు, శ్యాం రావు,(ఆదిలాబాద్), రేగ గణేష్ (భూపాలపల్లి), ప్రచార కార్యదర్శిగా కొడవ నగేష్, కోశాధికారిగా అడజంగు, సాంస్కృతిక కార్యదర్శిగా ఆగబోయిన రవి (మహబూబాబాద్), ప్రధాన సలహాదారులుగా సిద్దబోయిన లక్ష్మీనారాయణ (మహబూబాబాద్), కుర్సెంగు సూర్యభాను (ఆదిలాబాద్) ఎన్నికయ్యారు.

వృద్ధురాలి దారుణ హత్య

- కాజీపేట రహమత్ నగర్‌లో ఘటన



విజయ (ఫైల్)

కాజీపేట : ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురయ్యారు. దుండగులు అతి కిరాతకంగా కొట్టి చంపారు. ఈ ఘటన కాజీపేట పట్టణం 62వ డివిజన్ రహమత్ నగర్‌లో కలకలం రేపింది. కాలనీలో నివాసం ఉండే కోన విజయ (68) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబీకులు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విజయ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కలు అరుస్తుండడంతో కుటుంబీకులు బయటకు రాగా ఇంటి పక్క గల్లీలో విజయ విగత జీవిగా పడి ఉంది. శరీరంపై దుస్తులు సరిగా లేకపోవడంతో పాటు బంగారం కనిపించలేదు. దీంతో మృతురాలి కుమారుడు అశోక్ వెంటనే సీఐ సార్ల రాజుకు ఫిర్యాదు చేశారు.

విభిన్న కోణాల్లో పోలీసుల విచారణ..

కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐ సార్ల రాజుతో పాటు క్లూస్ టీం, డ్యాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో టిఫిన్ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన విజయ.. దాదాపు 16 గంటల పాటు ఎక్కడ ఉంది.. శరీరంపై ఉన్న బంగారం కోసమే నిందితులు హత్యచేసి ఇంటి వద్ద పడేసి ఉంటారా..? లేక అప్పుడప్పుడు చిన్న మొత్తంలో నగదును తెలిసిన వాళ్లకు ఇస్తుండేదనే సమాచారం మేరకు ఆ కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. తలపై బలమైన దెబ్బ కొట్టడంతోనే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. కాలనీలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.